క్లుప్తంగా

పోలింగ్ స్టేషన్ ముసాయిదాపై 12న సమావేశం

తిరుమలాయపాలెం: త్వరలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ స్టేషన్లు, తదితర విషయాలపై సలహాలు, సూచనలు తీసుకునేందుకు మండలంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులతో 12న సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సిలార్‌సాహెబ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో జరగనుండగా పార్టీల నాయకులు సకాలంలో హాజరు కావాలన్నారు.

బీకేఎస్ మండల కమిటీ ఎన్నిక

నేలకొండపల్లి: స్థానిక సత్యసాయిబాబా ఆలయంలో మంగళవారం జరిగిన భారతీయ కిసాన్ సంఘ్(బీకేఎస్) మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సోమశేఖర్, ప్రధాన కార్యదర్శిగా పాలడుగు పూర్ణచంద్రప్రసాద్, ఉపాధ్యక్షుడిగా వెలగపూడి రామకృష్ణ, కోశాధికారిగా ప్రవీణ్, సహాయ కార్యదర్శులుగా చౌకం శ్రీను, దండా కిరణ్, మన్నె శ్రీనివాస్‌లు ఎన్నికయ్యారు. అనంతరం పలు శాఖల అధికారులను కలిసి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామారావు, రమేష్, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

వనంలో విద్యార్థుల సందడి


నృత్యం చేస్తున్న చిన్నారులు

కామేపల్లి: మండలంలోని కొమ్మినేపల్లి గ్రామ పంచాయతీ పరిధి కొమ్మినేపల్లి, సీఎంతండా, బండిపాడుకాలనీ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు మంగళవారం వనంలో ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శంకర్, మిట్యా, మురళీధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం


ఖమ్మంఅర్బన్: నగరంలోని 11 కేవీ డైరీ విద్యుత్ లైన్ ఫీడర్ మరమ్మతుల దృష్ట్యా బుధవారం(నేడు) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మమత రోడ్డు విద్యుత్ సెక్షన్ ఏఈ చావా లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వరదయ్యనగర్, పోలీసుకాలనీ, మమత మెడికల్ కాలేజీ, వైరారోడ్డు, రోటరీనగర్, రాజరాజేశ్వరి గుడి తదితర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఏఈ కోరారు.

ఉచిత పశు వైద్య శిబిరం


రైతుకు బహుమతి అందిస్తున్న వైద్యాధికారి

నేలకొండపల్లి: మండలంలోని పైనంపల్లిలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం, దూడల ప్రదర్శన విజయవంతమైంది. ఈ సందర్భంగా 25 పశువులకు సాధారణ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం 65 దూడలకు నట్టల నివారణ మందు తాగించి, బలంగా ఉన్న దూడలకు చెందిన రైతులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా చెరువుమాధారం పశు వైద్యశాల వైద్యాధికారి సాహిత్య మాట్లాడుతూ.. రైతులు పశుసంపదతో ఆర్థిక స్వాలంబన సాధించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్‌వైజర్ జె.శంకరయ్య, గోపాలమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై వివక్ష తగదు


సమావేశంలో మాట్లాడుతున్న సత్యం

ఖమ్మంమయూరిసెంటర్(ఖమ్మం మామిళ్లగూడెం): విద్యార్థుల పెండింగ్ బకాయిలు విడుదల చేయకుండా వివక్ష చూపడం తగదని సోషల్ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దామల్ల సత్యం అన్నారు. మంగళవారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి గృహాల డైట్ బిల్లులపై ముఖ్యమంత్రి ఏమాత్రం నోరుమెదపడం లేదన్నారు. ఇకనైనా అసెంబ్లీ సమావేశాల్లో బకాయిలపై చర్చించి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు గొట్టిముక్కల శ్రీనివాస్, వీరబాబు, వెంకట్, అర్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధికి నోచుకోని ఖానాపురం-రఘునాథపాలెం బైపాస్‌ను కలిపే రోడ్డు


టేకులపల్లి నుంచి బాలపేటతండా వద్ద బైపాస్ రోడ్డును కలిపే డొంకరోడ్డు దుస్థితి

పాతడొంకలకు పాతర..!

'రియల్' గుప్పెట్లో డొంక రోడ్లు

- కబ్జాలతో కనుమరుగవుతున్న వైనం
- డొంకలను కలుపుకుని ప్లాట్లు
- అభివృద్ధి చేస్తే రవాణాకు మేలు

ఖమ్మంఅర్బన్: రోజురోజుకు విస్తరిస్తున్న ఖమ్మం నగరం.. పెరుగుతున్న జనాభా, నివాసాలకు తగినట్లుగా రోడ్లు లేకపోవడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తి ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఈ తరుణంలో ఇప్పటికే నగరంలో విస్తరించిన రియల్ వ్యాపారుల గుపెట్లో పూర్వ రెవెన్యూ డొంకలు అనేకం కనుమరుగవుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. డొంకలను కలుపుకుని ప్లాట్లుగా మారుస్తున్నారని, తద్వారా రవాణాలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వాటిని గుర్తించి లింకు రోడ్లుగా అభివృద్ధి చేస్తే మిగిలిన ఒకటి అరా డొంకలనైనా కాపాడుకోవడంతో పాటు రవాణాపరంగా సులువై కొంత మేర ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టినట్లవుతుంది.

నగర శివారులో..

ప్రధానంగా నగర శివారు గ్రామాల్లో గతంలో ఉన్న రెవెన్యూ డొంకలు కొన్ని కబ్జాలతో కనుమరుగవుతుండగా.. మరికొన్ని కుదించుకుపోయి దర్శనమిస్తున్నాయి. ఇలాంటి వాటిని ప్రభుత్వం ఇకనైనా గుర్తిస్తే అవి కబ్జాకోరల్లో చిక్కుకోకుండా ఉంటాయి. మిగిలిన వాటినైనా రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి గుర్తిస్తే ప్రభుత్వం చొరవతో అభివృద్ధి పరిచి ప్రజలకు ఉపయోగపడేలా రహదారి మార్గం చూపించినట్లవుతుంది.

ప్రభుత్వ డొంకలకు ఎసరు..

- ఇప్పటికే ఖమ్మం-బల్లేపల్లి డొంక రోడ్లు చాలా వరకు కబ్జాలకు గురైనట్లు ఆరోపణలు ఉన్నాయి. అసలు అక్కడ డొంక ఉందనేది ఈతరం వారికి తెలియకపోవడంతో పక్కన ఉన్న వెంచర్లలో వాటిని కలుపుకొని ప్లాట్లుగా చేసి విక్రయిస్తున్నారు. మరికొన్ని చోట్ల ప్రభుత్వ డొంకలనే వెంచర్లకు రహదార్లుగా మార్చుకున్నారనే ప్రచారం ఉంది.
- ఖమ్మం- కల్లూరు పాతడొంక కొన్నిచోట్ల ఆనవాళ్లు ఉంటే మరికొన్ని చోట్ల జాడలేదని పలువురు ఆరోపిస్తున్నారు. కల్లూరు డొంకను గోపాలపురం నుంచి ఖమ్మం వరకు గుర్తించి విస్తరిస్తే రవాణాకు ఉపయోగకరంగా ఉంటుంది.
- టేకులపల్లి నుంచి బాలపేటతండా వరకు, ఖానాపురం నుంచి రఘునాథపాలెం బైపాస్‌రోడ్డును కలిపే మరోడొంకను లెక్కల ప్రకారం తీసి వాటిని రోడ్లుగా మార్చితే రఘునాథపాలెం బైపాస్‌రోడ్డులో నిర్మాణం చేసే ప్రభుత్వ మెడికల్ కాలేజీకి విద్యార్థులు, అధ్యాపకులు, ఇతరత్రా పనుల నిమిత్తం వచ్చే వారికి ట్రాఫిక్ సమస్య లేకుండా ఉంటుంది.


డొంక రోడ్డునే లింక్‌రోడ్డుగా వినియోగించుకుంటూ..

- కై కొండాగూడెంలోని పాత డొంకలు, శ్రీనివాస్‌నగర్ ప్రాంతం, కొత్తగూడెం, అల్లీపురం, గొల్లగూడెం, గోపాలపురం, పాండురంగాపురం తదితర విలీన గ్రామాల పరిధిలో ఉన్న పురాతన డొంకలను గుర్తించి, వాటిల్లో పెరిగిన కంపచెట్లు తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కబ్జాలకు పోగా మిగిలిన వాటినైనా ఆక్రమణలకు గురికాకుండా అభివృద్ధి చేసి రహదార్లుగా మార్చాలని పలువురు కోరుతున్నారు. దీనిపై నియోజకవర్గ ఎమ్మెల్యే, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక దృష్టి సారించి డొంకలపై ప్రత్యేక కార్యక్రమం ద్వారా అభివృద్ధి పర్చాలని నివాసులు కోరుతున్నారు.

28లోగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి

నేలకొండపల్లి: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతం చేయాలని ఖమ్మం ఆర్‌డీఓ జి.నరసింహారావు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించి ధరణి తదితర విషయాలపై ఆరా తీశారు. అనంతరం నేలకొండపల్లి మేజర్ పంచాయతీలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపిక సర్వేను పరిశీలించి సర్వే బృందాలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ సర్వే బృందం రోజుకు 30 ఇళ్ల వరకు పూర్తి చేయాలని ఆదేశించామని, ఈనేపథ్యాన పాలేరు నియోజకవర్గంలో 70,018 దరఖాస్తులకు గాను తొలిరోజు 2,749 ఇళ్లను సర్వే చేసినట్లు తెలిపారు. కాగా, ఈ సర్వే ఈ నెల 28లోపు పూర్తి చేయనున్నామని, అందుకు అవసరమైతే అదనంగా మరికొన్ని బృందాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.


సర్వేను పరిశీలిస్తున్న ఆర్‌డీఓ నరసింహారావు

ప్రతీ మండల కేంద్రంలో మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు ప్రభుత్వ స్థలాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జె.మానిక్‌రావ్, ఎంపీడీఓ ఎం.యర్రయ్య, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌లు ఆలస్యం మధుసూదన్‌రావు, రవి, సర్వే బృందాలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నుల పంపిణీ


నోట్ పుస్తకాలు, పెన్నులు అందిస్తున్న దృశ్యం

ఖమ్మంఅర్బన్: నగరంలోని 6వ డివిజన్ రాస్తోగినగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం గుగ్గిళ్ల దివ్యమూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యాన నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. పేద విద్యార్థులను చదువులో ప్రోత్సహించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని కార్పొరేటర్ నాగండ్ల కోటేశ్వరరావు పేర్కొన్నారు. డాక్టర్ గుగ్గిళ్ల దివ్యమూర్తి, కాంగ్రెస్ నాయకుడు పైడిపల్లి సత్యనారాయణ, ఫౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు కిట్లు..

6వ డివిజన్ పారిశుద్ధ్య కార్మికులకు మంగళవారం మాస్కులు, గ్లౌజ్‌లు, జాకెట్ కలిగిన ఆరోగ్య రక్షణ కిట్లను కార్పొరేటర్ నాగండ్లకోటి పంపిణీ చేశారు. నిత్యం పని సమయంలో వీటిని వినియోగించుకోవాలని సూచించారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోండి


సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ రాధ

నేలకొండపల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎం.రాధ సూచించారు. మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం ఏఈఓలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా క్లస్టర్ వారీగా కొనుగోళ్లు, వరి కోతలపై ఆరా తీశారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా కేంద్రాల్లోనే అమ్మేలా చూడాలన్నారు. మండలంలోని ఇప్పటి వరకు 832 మంది రైతుల వద్ద నుంచి 42,266 క్వింటాలు కొనుగోలు చేయగా.. వారికి రూ.2,11,33,400 బోనస్ లభించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఏఈఓలు అవినాష్, అరవింద్, శశిరేఖ, దుర్గాభవాని, శిరీష తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లికి పాలాభిషేకం

ఖమ్మంమయూరిసెంటర్/నేలకొండపల్లి: తెలంగాణ తల్లి రూపుకల్పనలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన తప్పిదాలకు నిరసనగా బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు నగరంతో పాటు నేలకొండపల్లిలో ఆ పార్టీ ఆధ్వర్యాన తెలంగాణ తల్లి విగ్రహాలు, చిత్రపటాలకు పాలాభిషేకాలు చేశారు. ఈ మేరకు మంగళవారం నగరంలోని ఎన్‌టీఆర్ సర్కిల్ వద్ద బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు ఆధ్వర్యాన, నేలకొండపల్లిలో మండల నాయకులు పాలాభిషేకం చేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. తెలంగాణ ఆత్మగౌరవంగా నిలిచి స్వరాష్ట్ర ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిన తెలంగాణ తల్లిని గౌరవించుకునేందుకు పాలాభిషేకం చేసినట్లు తెలిపారు. ఈ మట్టి నిలుపుకున్న సాంస్కృతిక చిహ్నాలను మార్చే చేష్టలను ఎంత మాత్రం అంగీకరించేది లేదన్నారు. తెలంగాణ తల్లిని అవమానించేలా కాంగ్రెస్ నాయకులు వ్యవహరిస్తున్నారని పలువురు మండిపడ్డారు. తెలంగాణ తల్లి చేతిలో బతుకమ్మను పెట్టకపోవడం అన్యాయమన్నారు. ఖమ్మంలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ మార్పుల్, బుర్రి వెంకట్, మోతారపు సుధాకర్, పగడాల శ్రీవిద్య, కూరాకుల వలరాజు, తాజుద్దీన్, బిచ్చల తిరుమల రావు, మేకల సుగుణరావు, గుత్తా రవి, ప్రదీప్, వంగాల వెంకట్, రాంబాబు, కొల్లు పద్మ, షకీన, ఉబ్బలపల్లి నిరోషా, సురేష్, అబ్బాస్, నెమలి కిషోర్, పాదిల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు. నేలకొండపల్లిలో జరిగిన కార్యక్రమంలో నాయకులు వున్నం బ్రహ్మయ్య, నెల్లూరి లీలాప్రసాద్, మరికంటి రేణుబాబు, సాయిని సత్యం, శీలం వెంకటలక్ష్మి, మాదాసు ఆదాం, చెరువు నరసింహారావు, ఎండీ.వాజీద్, గొలుసు రవి, రేపాలకు సూరయ్య, తదితరులు పాల్గొన్నారు.


ఖమ్మంలో పాలాభిషేకం చేస్తున్న నాయకులు

పోస్టర్లు ఆవిష్కరణ

కామేపల్లి: ఈ నెల 28 నుంచి 31 వరకు ఏపీజీవీ బ్యాంక్ కార్యకలాపాలకు, ఆన్‌లైన్ సేవలకు అంతరాయం ఉంటుందని, ఖాతాదారులు సహకరించాలని బ్యాంక్ మేనేజర్ పి.శ్రీనివాస్ కోరారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. భారత ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఒక రాష్ట్రం-ఒక గ్రామీణ బ్యాంక్‌లో భాగంగా జనవరి 1 నుంచి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో విలీనం కానున్న నేపథ్యాన బ్యాంక్ సేవలకు అంతరాయం ఉంటుందన్నారు. అనంతరం బ్యాంక్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఫీల్డ్ ఆఫీసర్ ప్రకాశ్, నవీన్, క్యాషియర్ ఉపేంద్రమ్మ, సిబ్బంది రామనాగయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

'సెడార్ వ్యాలీ' విద్యార్థుల ప్రతిభ


సాధించిన పతకాలతో విద్యార్థులు

రఘునాథపాలెం: ఢిల్లీ నోయిడాలో జరిగిన రౌండ్ వరల్డ్ స్కాలర్‌కప్‌లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారని మండలంలోని వీవీపాలెంలో గల సెడార్ వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్ సెక్రటరీ, కరస్పాండెంట్ రవిమారుత్, డైరెక్టర్ ఆర్.పార్వతీరెడ్డి తెలిపారు. మొత్తం 33 మంది విద్యార్థులు 11 గ్రూపులుగా పాల్గొని మెడల్స్ సాధించారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులు సోఫియా, ముప్వా ఆరాధ్య, మాదిరాజు అపూర్వ, తదితరులు గోల్డ్, సిల్వర్ మెడల్స్ గెలుచుకోగా.. 7 గ్రూప్‌లకు చెందిన 21 మంది విద్యార్థులు గ్లోబల్ రౌండ్‌కు అర్హత సాధించారని తెలిపారు. ఈమేరకు మంగళవారం విద్యార్థులను అభినందించారు.

పొలం వద్ద ఘర్షణ..

- ఒకరికి గాయాలు

రఘునాథపాలెం: మండలంలోని ఈర్లపుడిలో పొలంలోని వైరు విషయమై ఘర్షణ జరుగగా ఒకరికి గాయాలయ్యాయి. రఘునాథపాలెం సీఐ ఉస్మాన్‌షరీఫ్ కథనం ప్రకారం.. ఈర్లపుడికి చెందిన భాస్కర్‌ను పక్కపొలానికి చెందిన పంగిడివాసి రాము అనే రైతు తనపొలంలో వైరు ఎందుకు తెంచావని మంగళవారం ఘర్షణకు దిగి దాడి చేశాడు. ఈఘటనలో భాస్కర్‌కు గాయాలు కాగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసునమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

ఖమ్మంమయూరిసెంటర్(ఖమ్మం మామిళ్లగూడెం): రఘునాథపాలెం మండలంలోని ఓ గ్రామంలో ఒంటరి మహిళపై లైంగిక దాడి చేసిన వ్యక్తిపై అట్రాసిటీ కేసు సైతం నమోదు చేయాలని వీరనారీమణుల ఆశయ సాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఖమ్మంలో మంగళవారం సమితి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భూక్యా ఉపేంద్రబాయి, జ్యోతి మాట్లాడుతూ.. నిందితుడిపై కేసు నమోదు చేయడమే కాక బాధితురాలిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈసమావేశంలో నాయకులు షేక్ నజీమా, జాన్‌బీ, త్రివేణి, చందు, విజయ, లలిత, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

'ఆశా'ల అక్రమ అరెస్టుకు నిరసన

రఘునాథపాలెం: ఆశా కార్యకర్తల అక్రమ అరెస్టులను నిరసిస్తూ మంగళవారం రఘునాథపాలెం మండల కార్యాలయాల కాంప్లెక్స్ ఎదుట సర్కిల్ వద్ద వర్కర్లు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్.నవీన్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు సమాయాత్తమవుతున్న నేపథ్యాన ఆరోగ్య సేవలు అందించే హెల్త్ వర్కలను అరెస్ట్ చేయడం సిగ్గుచేటన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆశా వర్కర్ల వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు పట్టించుకోవడం లేదన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ఆడబిడ్డలకు ప్రశ్నించే స్వేచ్ఛ లేదా అని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో హెల్త్ వర్కర్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జల్లారపు మంగ, డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి కూచిపూడి నరేష్, హెల్త్ వర్కర్స్ యూనియన్ మండల నాయకులు విజయ, అరుణ, దనమ్మ, సలోమి, అనసూర్య, సావిత్రి, బేబి తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం అడిగితే లాఠీచార్జినా..?

ఖమ్మంమయూరిసెంటర్: తమ సమస్యలు పరిష్కరించాలని శాంతియుతంగా హైదరాబాద్ కోటి డీఎంహెచ్‌ఎస్ ఆవరణలో ఆందోళన నిర్వహిస్తున్న ఆశవర్కర్లపై కాంగ్రెస్ ప్రభుత్వం లాఠీచార్జి చేయించడం ఎంత వరకు సమంజసమని పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.శిరోమణి ప్రశ్నించారు. మంగళవారం స్థానిక రామనరసయ్య విజ్ఞాన కేంద్రంలో పీఓడబ్ల్యూ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా ఉపాధ్యక్షురాలు ఝాన్సీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ప్రకారం కనీస వేతన చట్టం అమలు చేయాలని శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ఆశా కార్యకర్తలపై లాఠీచార్జీ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల మంగతాయి, ప్రతాపనేని శోభ, లలిత, స్వాతి, చైతన్య, పూలమ్మ, వసుమతి , పరిమళ తదితరులు పాల్గొన్నారు.


ఖమ్మంమయూరిసెంటర్: సమావేశంలో మాట్లాడుతున్న శిరోమణి

ప్రజాపాలన కాదు.. గత ప్రభుత్వ పాలనే..

ప్రజాపాలన మరిచి గత బీఆర్‌ఎస్ పాలనలా కాంగ్రెస్ వైఖరి కనిపిస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఆరోపించారు. నగరంలోని మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఆశా వర్కర్లు చలో హైదరాబాద్‌కు పిలుపునివ్వగా.. సోమవారం రాత్రి ఖమ్మంలోని అన్ని ప్రాంతాల్లో పోలీసులు ఆశావర్కర్ల ఇళ్లకు వెళ్లి భయభ్రాంతులకు గురిచేసి సుమారు 150 మందిని అరెస్ట్ చేశారన్నారు. ప్రజాస్వామ్య పాలన లేకుంటే గత ప్రభుత్వం గతే కాంగ్రెస్‌కు పడుతుందన్నారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎర్ర శ్రీకాంత్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు తుమ్మ విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు ఇప్పించాలని వినతి

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని కార్పొరేషన్ పరిధి గార్డెన్ సెక్షన్‌లో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు ఇప్పించాలని తెలంగాణ ప్రగతిశీల మున్సిపాలిటీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.రామయ్య పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యకు వినతిపత్రం అందజేశారు. నగరంలోని శ్రీనివాస్‌నగర్, ప్రకాష్‌నగర్ గోళ్లపాడు చానల్‌పైన ఉన్న పార్కులను శుభ్రం చేస్తున్న సుమారు 45 మంది కార్మికులకు గత ఆరు నెలల నుంచి జీతాలు రావడం లేదని, వెంటనే జీతాలు చెల్లించాలని కోరారు. ఇందుకు స్పందించిన కమిషనర్ వారం రోజుల్లో చెల్లించేలా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిల మున్సిపాలిటీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు దున్న గురవయ్య, టీయూసీఐ ఖమ్మం ఏరియా కమిటీ కార్యదర్శి కె.శ్రీనివాస్, కార్మికులు నందిని, స్వప్న, రేణుక, స్వరూప, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మండల స్థాయి క్రీడలు ప్రారంభం

రఘునాథపాలెం/నేలకొండపల్లి: సీఎం కప్-2024 క్రీడా పోటీల్లో భాగంగా మంగళవారం మండలాల్లో మండలస్థాయి క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ఈనేపథ్యాన రఘునాథపాలెం మండలం వీవీపాలెం పాఠశాలలో నిర్వహించిన పోటీలను ఎంపీడీఓ అశోక్‌కుమార్, నేలకొండపల్లి మండలం కొత్తకొత్తూరులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో నిర్వహించిన పోటీలను ఎంపీడీఓ ఎం.యర్రయ్యలు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడాకారులు తమ ప్రతిభను గ్రామస్థాయి నుంచి ప్రపంచస్థాయికి రూపకల్పన చేయడమే ప్రభుత్వ ముఖ్యఉద్దేశమన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, అందుకు నిత్యం పోటీ పడుతూ క్రీడలను మెరుగుపరుచుకోవాలన్నారు. కాగా, గత రెండు రోజులు క్రితం గ్రామ పంచాయతీల స్థాయిలో గెలిచిన విద్యార్థులు మండలస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. వీవీపాలెం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ విల్సన్, మండల విద్యాధికారి రాములు, పాఠశాల హెచ్‌ఎం శ్రీమన్నారాయణ, పీఈటీ ఆదర్శ్, పంచాయతీ కార్యదర్శి బి.కృష్ణ, వీరబాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే కొత్తకొత్తూరులో జరిగిన కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సీతారాములు, తహసీల్దార్ జె.మానిక్‌రావ్, మండల పంచాయతీ అధికారి శివ, హెచ్‌ఎంలు, పీఈటీలు, పీడీలు తదితరులు పాల్గొన్నారు.


రఘునాథపాలెం: పోటీల్లో తలపడుతున్న జట్లు

'అదానీ' అవినీతిపై విచారించాలి

ఖమ్మంమయూరిసెంటర్: అదానీ గ్రూప్స్ అవినీతి, అక్రమాలపై ఆధారాలున్నా.. కేంద్ర ప్రభుత్వం విచారణ చేయకపోవడం విడ్డూరంగా ఉందని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు అన్నారు. సీపీఐ దేశవ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం అంబేడ్కర్ సెంటర్ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అదానీ లాంటి వారు దేశ సంపదను దోచుకుంటున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు జమ్ముల జితేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు మహ్మద్ సలాం, తోట రామాంజనేయులు, వెంకటరెడ్డి, పగడాల మల్లేష్, పోటు కళావతి, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, జిల్లా సమితి సభ్యులు చెరుకుపల్లి భాస్కర్, నూనె శశిధర్, గాదె లక్ష్మీనారాయణ, నానబాల రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, రామకృష్ణ పాల్గొన్నారు.

సీపీఎం మహాసభలను జయప్రదం చేయండి

తిరుమలాయపాలెం: ఖమ్మంరూరల్ మండలం ఏదులాపురంలో ఈ నెల 12వ తేదీన జరిగే సీపీఎం పాలేరు డివిజన్ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి శ్రీను పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్వహించిన ప్రచారంలో ఆయన మాట్లాడారు. మహాసభల్లో భాగంగా తొలుత ఎర్ర జెండా కవాత్ నిర్వహించబడుతుందన్నారు. ఈ మహాసభలకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తదితరులు పాల్గొంటారని, అందరూ సకాలంలో హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు వేగనాటి వెంకట్రావు, పులకాని వెంకటనరసయ్య, పుట్టల గురువులు, కుంట వెంకటేశ్వర్లు, పుట్టల ఉపేందర్, శ్రీను, వెంకటేశ్వర్లు, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

సీపీఎంతోనే సమస్యల పరిష్కారం

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని సమస్యలు సీపీఎంతోనే పరిష్కారమవుతాయని ఆ పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కొందరికే ఇచ్చారని, కాంగ్రెస్ ప్రభుత్వమైన అర్హులైన పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు అందజేయాలని కోరారు. అంతేకాక పెన్షన్లు పెంచాలని, గతంలో మంత్రి తుమ్మల నాగేశ్వరావు హామీ మేరకు ఖమ్మం కేంద్రంగా జనరల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, నాగపూర్, అమరావతి అలైన్మెంట్ మార్చాలని, భూములు కోల్పోయిన రైతులకు మార్కెట్ రేట్ ఇవ్వాలన్నారు. నగరంలోని బస్ డిపో, ఎన్‌ఎస్టీ, ఆర్డీవో కార్యాలయం, రైల్వే స్టేషన్, ఖిల్లా, దానవాయిగూడెం, గోపాలపురం, పాత సీపీఐ కార్యాలయం రోడ్లను 80 అడుగులు వెడల్పు చేయాలని, ఖానాపురం, లకారం చెరువుల అలుగు ప్రాంతాల్లోని కబ్జా గురైన వాటిని తొలగించి సైడ్ వాల్స్‌ను నిర్మించాలని కోరారు. సమస్యలు పరిష్కరించలేని పక్షంలో దశలవారీ ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు ఎంఏ జబ్బార్, ఖమ్మం అర్బన్ మండల కార్యదర్శి బత్తిని ఉపేందర్, వన్‌టౌన్ కార్యదర్శి ఎస్‌కె నాగులుమీరా, త్రీ టౌన్ కార్యదర్శి భుక్యా శ్రీను తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న విక్రమ్